

జానమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, కుటుంబసభ్యులు

## కట్టా శేఖర్‌రెడ్డికి ప్రముఖుల పరామర్శ

మాడ్గులపల్లి, జనవరి 3: రాష్ట్ర సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ కట్టా శేఖర్‌రెడ్డి మాతృమూర్తి కట్టా జానమ్మ ఇటీవల మృతి చెందారు. బుధవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో జరిగిన సంతాప కార్యక్రమంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి కుటుంబసభ్యులతో హాజరయ్యారు. జానమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం కట్టా శేఖర్‌రెడ్డిని పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో ఏపీ ప్రభుత్వ సలహాదారు, సీనియర్ జర్నలిస్ట్ దేవులపల్లి అమర్, తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, మాజీ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న ఉన్నారు.



నందికొండ : పైలాన్‌కాలనీలోని పోస్ట్ ఆఫీస్‌లో వివరాలు సేకరిస్తున్న సీఐ బీసన్న

## సబ్ పోస్ట్‌మాస్టర్ చేతివాటంపై పోలీసుల విచారణ

నందికొండ, జనవరి 3 : నందికొండ పైలాన్‌కాలనీలోని పోస్టాఫీస్‌లో సబ్ పోస్ట్‌మాస్టార్‌గా పని చేసిన రామకృష్ణ పలువురి ఖాతాల నుంచి కోటిన్నరకు పైగా నగదు మాయం చేసిన ఘటనపై బాధితులు, పోస్టల్ అధికారులు చేసిన ఫిర్యాదులపై నాగార్జునసాగర్ సీఐ బీసన్న బుధవారం విచారణ చేపట్టారు. పోస్టాఫీసును సందర్శించి రికార్డులు, పాస్ పుస్తకాలు పరిశీలించారు. ప్రస్తుతం విధుల్లో ఉన్న సబ్ పోస్ట్‌మాస్టర్ రంగయ్య, బాధితుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సబ్ పోస్ట్‌మాస్టర్‌గా పని చేసిన రామకృష్ణ ఖాతాదారుల ప్రమేయం లేకుండా వారి ఖాతాల్లోంచి డబ్బులు డ్రా చేసి తన సొంతానికి వాడుకున్నట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. సేవింగ్, ఫిక్స్‌డ్ డిపాజిట్ ఖాతాల నుంచే కాకుండా కొన్ని ఫేక్ ఖాతాలను తెరిచి నగదును మాయం చేశాడన్నారు. ఈ విషయమై పూర్తి స్థాయిలో విచారణ చేపడుతున్నట్లు చెప్పారు. రామకృష్ణ రూ.80 లక్షలు వాడుకున్నట్లు పోస్టల్ అధికారులు ఫిర్యాదు ఇచ్చారన్నారు. కానీ సుమారు కోటిన్నరకు పైగా వాడుకున్నట్లు ఖాతాదారులు ఫిర్యాదు చేశారన్నారు. ఈ విషయమై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు.

## గెజిటెడ్ అధ్యాపకుల రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా వెంకటేశ్వర్లు

దేవరకొండ, జనవరి 3 : గెజిటెడ్ అధ్యాపకుల రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల అధ్యాపకుడు వెంకటేశ్వర్లు నియామకమయ్యారు. ఈ మేరకు బుధవారం సంఘం నాయకులు ఉత్తర్వులు జారీ చేశారు. దాంతో వెంకటేశ్వర్లును కళాశాలలో తోటి అధ్యాపకులు శాలువాతో ఘనంగా సత్కరించారు.



వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న అధ్యాపకులు

కార్యక్రమంలో అధ్యాపకులు సాయిలు, శ్రీను, నర్సింహ, నవత, రాజు, శ్రీదేవి, నజర్‌హుస్సేన్, మహిందర్, జయప్రకాశ్‌నారాయణ, పార్థసారధి, అమీనాపర్వీన్ పాల్గొన్నారు.

## మోదీ సర్కారును గద్దె దించడమే ఇండియా కూటమి లక్ష్యం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

రామగిరి, జనవరి 3: ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోదీ సర్కార్‌ను గద్దె దించడమే లక్ష్యంగా ముందు సాగుతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి తెలిపారు. నల్లగొండలోని దొడ్డి కొమురయ్య భవనంలో బుధవారం నిర్వహించిన సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి హాజరై మాట్లాడారు. ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టి మూడోసారి అధికారంలోకి రావాలని కుట్ర చేస్తుందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి డబ్బికార్ మల్లేశ్, నారి ఐలయ్య, ప్రమీల పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలన్నీ అమలు చేస్తాం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం
- కొనసాగుతున్న ప్రజాపాలన గ్రామసభలు

కట్టంగూర్, జనవరి 3 : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తున్నదని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. బుధవారం నకిరేకల్ పట్టణంలోని పలు వార్డులతో పాటు కడపర్తి, కట్టంగూర్ మండలం ముత్యాలమ్మగూడెం, దుగినవెల్లి, కేతేపల్లి మండలం కొర్లపహాడ్, ఇనుపాముల, నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణ వెల్లంల గ్రామాల్లో జరిగిన ప్రజాపాలన గ్రామ సభల్లో పాల్గొని మాట్లాడారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఆరు గ్యారెంటీల పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో నకిరేకల్ మున్సిపల్ కమిషనర్ బాలాజీ, ఎంపీపీలు బచ్చుపల్లి శ్రీదేవీగంగాధర్‌రావు, జెల్లా ముత్తి లింగయ్య, ఎంపీడీఓ పోరెళ్ల సునీత, రమేశ్, తాసీల్దార్ స్వప్న, ప్రసాద్, డీటీ సుకన్య, ఎంపీఓ మహ్మద్ అథర్ పర్వేజ్, ఆర్ఐ కుమార్‌రెడ్డి, ఏపీఓ కడెం రాంమోహన్, ఏపీఎం చౌగోని వినోద, సర్పంచులు, ఎంపీటీసీ పాల్గొన్నారు.



కట్టంగూర్ : దుగినవెల్లిలో ప్రజా పాలన గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరేశం

### ప్రజాపాలన నిరంతర ప్రక్రియ : ఎమ్మెల్యే బీఎల్ఆర్

దామరచర్ల, జనవరి 3 : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభయహస్తం ఆరు గ్యారెంటీ పథకాలకు దరఖాస్తులు స్వీకరించే ప్రజా పాలన కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలో కొత్తపేటతండా, కేతావత్‌తండా, వీర్లపాలెం, తాళ్లవీరప్పగూడెం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన ప్రజా పాలనలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో రెండు పథకాలు ఇప్పటికే అమలవుతున్నాయని, మిగతావి వందరోజుల్లో అమలు చేయనున్నట్లు చెప్పారు. రేషన్ కార్డులు లేకున్నా పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నందిని, ఎంపీడీఓ కృష్ణమూర్తి, తాసీల్దార్ శంకర్‌నాయక్ సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



దామరచర్ల : తాళ్లవీరప్పగూడెం గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

### దరఖాస్తుల స్వీకరణ

నార్కట్‌పల్లి : మండలంలోని దాసరిగూడెం, బివెల్లెంల, జువ్విగూడెం, నక్కలపల్లి గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్ రెడ్డి, ఎంపీడీఓ యాదగిరి, తాసీల్దార్ పద్మ పాల్గొన్నారు.

శాలిగౌరారం: మండలంలోని వల్లాల, చిత్తలూర్, బైరవునిబండ గ్రామాల్లో ప్రజాపాలన నిర్వహించారు. శాలిగౌరారం జడ్పీటీసీ ఎర్ర రణీలాయాదగిరి పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో తాసీల్దార్ పాల్‌సింగ్, ఎంపీడీఓ రేఖల లక్ష్మయ్య, సర్పంచులు షేక్ ఇంతియాజ్, మామిడికాయల జయమ్మ, దండ రేణుకా అశోక్‌రెడ్డి, ఎంపీఓ సుధాకర్, పాల్గొన్నారు.

మునుగోడు : మండలంలోరావిగూడెం, సోలిపురం, గూడపూర్ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్.భాస్కర్‌గౌడ్, తాసీల్దార్ నరేందర్, ఏఈఓలు, డీటీ నరేశ్, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

## అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ



అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్

మిర్యాలగూడ, జనవరి 3 : అయోధ్య రామ మందిరం నుంచి వచ్చిన అక్షింతలను బుధవారం పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ భక్తులకు పంపిణీ చేశారు. అక్షింతలను ప్రతి ఇంటికీ అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు రాయపూడి భవానీ, శ్రీనివాస్, గుండా నాగరాజు, భువనగిరి పవన్‌కుమార్, హైమావతి, లావణ్య, అజయ్, భిక్షపతి పాల్గొన్నారు.

## క్రీడల్లో యువత రాణించాలి

### ఎమ్మెల్యే బాలూనాయక్

దేవరకొండరూరల్, జనవరి 3 : విద్యార్థులు, యువకులు క్రీడల్లో రాణించడం ద్వారా దేవరకొండకు పేరు తేవాలని స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ సూచించారు. బుధవారం మండలంలోని మైనంపల్లి గ్రామంలో నిర్వహించిన కొర్ర రమేశ్‌నాయక్ స్మారక నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక ఒత్తిడిని జయించగలుగుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జాన్‌యాదవ్, టీపీసీ సభ్యుడు జాలె నర్సింహారెడ్డి, ఎంపీటీసీ కొర్ర గౌతమీరాంసింగ్ పాల్గొన్నారు.



దేవరకొండ రూరల్ : మైనంపల్లి గ్రామంలో నియోజక వర్గ స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలూనాయక్

## కరీంనగర్ టు నర్సరావుపేట బస్సు రద్దు

దామరచర్ల, జనవరి 3 : గత 25 ఏండ్లుగా నడుస్తున్న కరీంనగర్ – నర్సరావుపేట బస్సు సర్వీసును ఆర్టీసీ అధికారులు రద్దు చేశారు. కరీంనగర్ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సును 1995లో మొదట కరీంనగర్ నుంచి గుంటూరు జిల్లా దాచేపల్లి వరకు నడిపించారు. బస్సు సర్వీస్‌కు మంచి ఆదరణ రావడంతో పిడుగురాళ్ల, నర్సరావుపేట వరకు పొడిగించారు. కరీంనగర్, వరంగల్, సూర్యాపేట, నల్లగొండ, పల్నాడు జిల్లాలను కలుపుతూ వెళ్లే బస్సులో నిత్యం వందలాది మంది ప్రయాణించేవారు. ప్రతి రోజు ఉదయం 5.30 గంటలకు దామరచర్ల మండల కేంద్రానికి బస్సు వచ్చేది. దాంతో మండల ప్రజలు వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సు సర్వీసును వినియోగించుకునే వారు. బస్సు సర్వీసును రద్దు చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సును పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు.